RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే
దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 246
శుక్రవారం, ఆగస్టు 21, 2026, పేజీలు - 4 వెల : 2/-

కింద పడ్డానని ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే
- అబ్దుల్ కలాం

## అడకత్తెరలో కేంద్రం: వరుస దెబ్బలు
# వెన్ను చూపక తప్పట్లేదు.. !!

**న్యూఢిల్లీ :** ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వానికి ఏదీ కలిసి రావట్లేదు. ఒకదాని వెంట వరుస దెబ్బలు తగులుతున్నాయి. కొన్ని కీలక విషయాల్లో చేతులు కాల్చుకోవాల్సి వస్తోంది. మొన్నటికి కాక్రోచ్ జనత పార్టీ ధాటికి ఏకంగా కేంద్ర మంత్రే రాజీనామా చేయాల్సొచ్చింది. దాని నుంచి తేరుకోకముందే.. బీహార్ లోని బాంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో చేతు అనుభవాన్ని చవి చూసింది. సాక్షాత్.. భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడే ఖాళీ చేసిన ఈ కంచుకోటను నిలబెట్టుకోలేకపోయింది. 2010 నుంచి ఏకచ్ఛత్రాధిపత్యాన్ని వహిస్తూ వచ్చిన ఈ నియోజకవర్గాన్ని బంగారం పళ్లెంలో పెట్టి మరీ జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ చేతిలో పెట్టింది



కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏకు నాయకత్వాన్ని వహిస్తోన్న బీజేపీ. ఈ వరుస ఘటనల నేపథ్యంలో మడమ తిప్పక తప్పని పరిస్థితిని ఎదుర్కొంటోంది. కులం, విద్యార్థులకు సంబంధించిన కొన్ని కీలక అంశాలను పునఃసమీక్షించుకుంటోండటం దీనికి నిదర్శనం. దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్ష నిరోధానికి తీసుకొచ్చిన నూతన యూజీసీ మార్గదర్శకాలను పునఃసమీక్షించుకోనుంది కేంద్రం. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు సైతం తెలియజేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అధికారికంగా సమాచారం ఇచ్చారు.
యూజీసీ మార్గదర్శకాలను పునఃసమీక్షించుకోవడం అనేది.. కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బే.

## బలమైన రాష్ట్రాలే..
# మరింత బలమైన భారత్‌కి పునాది

### : సీఎం విజయ్



**చెన్నై, ఆగస్టు 20:** 'బలమైన రాష్ట్రాలే.. మరింత బలమైన భారతదేశానికి పునాది' అని తమిళనాడు సీఎం విజయ్ అభివర్ణించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సీఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు సీఎం విజయ్ మాట్లాడుతూ పలు కీలక అంశాలు లేవనెత్తారు. సహకార సమాఖ్య విధానమే దేశ బలానికి పునాది అని వ్యాఖ్యానించారు. కేంద్రం - రాష్ట్రాలు, రాష్ట్రాల మధ్య విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్టబద్ధ విధానాల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాల పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గకూడదని ఆయన స్పష్టం చేశారు.

## క్రమశిక్షణ కమిటీకి లేఖ రాయనున్న కొండా సురేఖ..
# కూతురిని సమర్థిస్తారా?



**హైదరాబాద్, ఆగస్టు 20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాయ నున్నారు. ఈరోజు (గురువారం) సాయంత్రం లేఖ ద్వారా వివరణ ఇవ్వనున్నారు. నిన్న (బుధవారం) సీఎం రేవంత్ రెడ్డిపై సుస్మిత.. తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న క్రమశిక్షణ కమిటీ.. కొండా సుస్మిత పటేల్‌కు కాంగ్రెస్ సభ్యత్వం లేకపోవడంతో సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గతంలోనూ సీఎంపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేయగా.. కూతురి తరపున సీఎంకు కొండా సురేఖ క్షమాపణ చెప్పిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో తాజా వ్యాఖ్యలపై.. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణలో మంత్రి ఎలాంటి అంశా లను ప్రస్తావిస్తారన్న దానిపై నెలకొన్న ఉత్కంఠ నెలకొంది. కూతురి వాఖ్యలను సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా అనేది తెలియాల్సి ఉంది. లేదంటే కూతురు చేసిన వాఖ్యలను ప్రస్తావించకుండా పరకాల అంశాన్ని లేవనెత్తుతారా అనే సస్పెన్స్ కొనసాగుతోంది.

## రైతుల భూ సమస్యలకు
# భూ భారతి పరిష్కారం

### : మంత్రి పొంగులేటి

**ఖమ్మం, ఆగస్టు 20:** జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే



లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి సంఘీబావం ప్రకటిస్తున్నా..
# అన్ని విధాలుగా అండగా బీఆర్ఎస్ పార్టీ

### : కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 20:** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసేలా కాంగ్రెస్ సర్కార్ జీవో 97 తీసుకు రాగా.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్న విషయం తెలిసిందే. జీవో 97కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యా ప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరా టానికి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ మద్దతుగా నిలిచి ఆందోళనల్లో పాల్గొంటుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, వారితో బీఆర్ఎస్వీ కలిసి చేస్తున్నపోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్టు ట్వీట్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందన్నారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. విద్యార్థుల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా..

## తెలంగాణలో సెక్షన్ 22 పై రాహుల్‌కు హరీశ్ లేఖ..
# కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 20:** తెలంగాణలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం అవుతోందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతోందని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటోన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 22ఏ అనేది నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టమని.. ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని వెల్లడించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను



ఏకపక్షంగా 22ఏ జాబితాలో పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబి తా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ హరీశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి జిల్లాలో 40వేల ఎకరాలను 22ఏ లో పెట్టారని నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి.. రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్ మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖలో ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ఇంత కుంభకోణం జరుగుతున్నా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు.

# అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న జగన్

### మంత్రి లోకేశ్

**అమరావతి, ఆగస్టు 20:** ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అవగాహన లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుంటున్నారా? అంటూ వైసీపీ అధినేతపై మండిపడ్డారు. ఆరాజా అంటే ఏమిటో, ఖాజా అంటే ఏమిటో జగన్‌కు తెలియదంటూ వ్యంగ్యంగా అన్నారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుంటూ ఎద్దేవా చేశారు.
వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించ లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించ లేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారంటూ జగన్‌కు చురకలంటించారు



పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేశ్ నిప్పులు చెరిగారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని వైఎస్ జగన్‌కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్‌కు కౌంటర్ ఇచ్చారు.

## ఇరాన్‌కి సహాయం చేస్తే..
# ఆర్థిక మూల్యం తప్పదు

### :డొనాల్డ్ ట్రంప్



**అమెరికా:** కొంతకాలం నుంచి ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వాటిని తగ్గించేందుకు మధ్య మధ్యలో శాంతి చర్చలు జరిగినప్పటికీ అవి సఫలం కాలేదు. ఇదే సమయంలో ఇరాన్, అమెరికా దేశాలు పరస్పరం హెచ్చరికలు చేసుకుంటున్నాయి. తాజాగా ఇరాన్ మిత్ర దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశానికి సహాయం చేస్తే.. భారీగా ఆర్థిక మూల్యం తప్పదని స్పష్టం చేశారు. ఇరాన్‌కు సహాయం చేసే కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని దాని మిత్రదేశాలకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ' నా కంటే గొప్ప ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు నాకంటే గొప్ప అవకాశాన్ని మరెవరూ ఇవ్వలేదు. దాన్ని వారు సద్వినియోగం చేసుకోలేదు. అందుకే నేను ఏ దేశంపైనా కూడా ఇప్పటి వరకు చేపట్టిని అత్యంత కఠిన ఆర్థిక చర్యలు తీసుకుంటున్నాను. దీంతో ఇరాన్ ఊహించని స్థాయిలో ఏకాకిగా మారుతుంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్ లో పేర్కొన్నారు. 'ఏ దేశమైనా తమ ఆర్థిక సంస్థలు, వ్యాపారాలు, విమానాశ్రయాలు లేదా ప్రభుత్వ సంస్థల ద్వారా పరిణామాలను ఎదుర్కోక తప్పదు.

# చేగుంటలో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

**చేగుంట ఆగస్టు 20 మెదక్ టుడే న్యూస్**


దివంగత మాజీ భారత ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ 82వ జయంతిని చేగుంట గాంధీ చౌరస్తా వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు.దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యకర్తలు "అమర్ హై అమర్ హై రాజీవ్ గాంధీ అమర్ హై" అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వడ్ల నవీన్ కుమార్ మాట్లాడుతూ –భారతరత్న స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. టెక్నాలజీకి పెద్దపీట వేశారు. టెలికమ్యూనికేషన్స్, వాణిజ్య, రక్షణ, విమానయాన రంగాల్లో



సంస్కరణలు ప్రవేశపెట్టారు–అని అన్నారు. –విద్యావకాశాల సమానత్వం కోసం నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ తీసుకొచ్చారు. సాంకేతిక భారత నిర్మాత, యువత మహిళలకు రాజకీయాలలో అవకాశం కల్పించారు.పంచాయితీ రాజ్ చట్టం తెచ్చి గ్రామీణ స్థాయి వరకు అధికార వికేంద్రీకరణ చేసిన నాయకుడు రాజీవ్ గాంధీ వారి ఆశయాలు, సిద్ధాంతాలు ఇలాగే కొనసాగాలి. వారికి ఇవే మా నివాళులు–అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జూకంటి రాజా గౌడ్, చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, ఏఎంసి డైరెక్టర్లు దొంతి రెడ్డి బాల్, కురుమ లక్ష్మి రెడ్డి, మొజామిల్, కాశబోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, మహేష్, దుబ్బాక అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొల్ల ప్రశాంత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు మద్దూరి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిల్ గౌడ్, స్వామి, శ్రీను నాయక్ తో పాటు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ రోడ్డు బ్రిడ్జి పనుల కారణంగా నేడు విద్యుత్ నిలిపివేత

**చేగుంట ఆగస్టు 20 మెదక్ టుడే న్యూస్**



చేగుంట మండలం మెదక్ రోడ్ వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం రేపు విద్యుత్ సరఫరానునిలిపివేయనున్నట్లు చేగుంట విద్యుత్ శాఖ ఏ ఈ వెంకటప్ప రెడ్డి తెలిపారు.బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను నరికివేయాల్సి ఉండటంతో శు క్రవారం 21.08.2026 న ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మెదక్ రోడ్ఏరియా ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.ఈ కోత కారణంగా ఆ ఏరియాలోని ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలకు ఇబ్బంది కలగనుంది. కావున ప్రజలు, వ్యాపారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ రాస్తా రోఖో నిర్వహించిన పాలిటెక్నిక్ విద్యార్థులు..





**చేగుంట ఆగస్టు 20 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలో స్థానిక గాంధీ చౌరస్తా దగ్గర ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని జి.ఓ నం.97 రద్దు కోరుతూ సాంకేతిక విద్యా వ్యవస్థ పరిరక్షణకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఏబీవీపీ చేగుంట శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ స్టేట్ ఖేల్ కో కన్వీనర్ బండారి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల వల్ల పాలిటెక్నిక్ కళాశాలలు దెబ్బతినే అవకాశం ఉన్నందున ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగిస్తూ పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు.ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు అనేవి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అందుబాటులో ఉండే ఒక చక్కని నాణ్యమైన విద్యావ్యవస్థ అలాంటి ఈ సాంకేతిక విద్యను ప్రైవేట్ సంస్థల్లో విలీనం చేసి ఇంజనీర్ కావాలనే వారి కలల్ని దూరం చేసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాలలు అద్భుతంగాకొనసాగుతున్నాయని, విలీనం చేయడం కాకుండా మరింత బలోపేతం చేసి మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానం మరియు మెరుగైన ప్లేస్‌మెంట్లు కల్పించాల్సింది పోయి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో "శక్తి "అనే విభాగంలో చేర్చి ఉన్నత విద్యకు లక్షల మంది విద్యార్థులను దూరం చేసి నిధులను దారిమళ్లించే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ కళాశాలలను యధావిధిగా కొనసాగించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాస్కర్ కార్యకర్తలు సంతోష్ ధనరాజ్ మహేష్ సతీష్ నవీన్ అభిలాష్ శివ సుశాంత్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయం పొందేలా రైతులను ప్రోత్సహించాలి

**- ఆర్గానిక్ సాగు చేస్తున్న రైతును అభినందించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,ఆగస్టు,20,మెదక్ టుడే న్యూస్ (ప్రతినిధి):**

హవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతిపూర్ గ్రామంలో రైతు దొమ్మట జైపాల్‌రెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం పరిశీలించారు. ఒక ఎకరంలో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, సాగు ఖర్చులు, దిగుబడి, మార్కెట్ ధరలు, ప్రభుత్వం అందించిన సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే డ్రాగన్ ఫ్రూట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేసేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆదాయం పెంచుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆర్గానిక్ పద్ధతిలో ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు జైపాల్‌రెడ్డిని కలెక్టర్ అభినందించారు. సాగులో డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ పద్ధతులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బండ్లగూడ బాధితులకు న్యాయం చేయాలి

**రైల్వే అధికారులకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు వినతి**






**పటాన్‌చెరు, ఆగస్టు 20:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ పరిధిలో రైల్వే స్థలాల పేరిట పేదల ఇళ్లను కూల్చివేస్తామంటూ నోటీసులు జారీ చేయడం తగదని, బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన బాధితులతో కలిసి సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడు తూ: దశాబ్దాలుగా పేద ప్రజలు అక్కడే ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, ఎలాంటి ముందస్తు ప్రత్యామ్నాయం చూపకుండా ఒక్కసారిగా ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు.గతంలో రైల్వే అధికారులు తమ స్థలాలకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసుకోకపోవడం, సంబంధిత రైల్వే ట్రాక్‌ను సైతం తొలగించడంతో పేదలు అక్కడ ఆవాసాలు ఏర్పరచుకున్నారని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి నివాసముంటున్న వారిని హఠాత్తుగా ఇళ్లు వదిలి వెళ్లిపోవాలని ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు.అధికారులు మానవతా దృక్ప థంతో ఆలోచించి, బాధితుల వాదనలను పూర్తిగా విని వారికి తగిన సమయం, న్యాయం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

**- రైతులకు అదనపు ఆదాయం.. సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,ఆగస్టు,20,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)**

తేనెటీగల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయంతో పాటు స్వయం ఉపాధి పొందవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం హవేలీ ఘన్‌పూర్ మండలం బోగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్‌రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తేనెటీగల పెంపకాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 మంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులను 40 శాతం సబ్సిడీ, 60 శాతం లబ్ధిదారుల వాటాతో అందించినట్లు తెలిపారు. ఒక్క బాక్సుకు రూ.6 వేల ఖర్చు కాగా, ఉద్యానవన శాఖ రూ.2,400 సబ్సిడీగా, లబ్ధిదారు రూ.3,600 భరించాల్సి ఉంటుందని వివరించారు.ఒక్క బాక్సు ద్వారా 15 రోజులకోసారి సుమారు 3 కిలోల తేనె ఉత్పత్తి అవుతుందని, కిలోకు రూ.600 చొప్పున రూ.1,800 వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. 104 బాక్సుల ద్వారా నెలకు సుమారు 312 కిలోల తేనె ఉత్పత్తి చేసి రూ.1.87 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.తేనెటీగల పెంపకంపై నిపుణుల ద్వారా పూర్తి అవగాహన, శిక్షణ పొందాలని రైతులకు సూచించారు.వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని కోరారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన సాంకేతికతపై గీతం అధ్యాపకులకు శిక్షణ


**- మ్యాట్ ల్యాబ్ ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై కార్యశాల**

**పటాన్ చెరు, ఆగస్టు 20:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని, బోధన–శిక్షణా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు గాను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అధ్యాపకులకు మ్యాట్ ల్యాబ్ ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై మూడు రోజుల ప్రత్యేక కార్యశాలను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించారు. ఈ వర్క్ షాపును ఆర్కాన్స్ ఇన్, మ్యాథ్ వర్క్స్ ల సంయుక్త సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ (జీఎస్సీఈ)లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం నిర్వహించింది.ఈ కార్యశాలను, మ్యాట్ ల్యాబ్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డీప్ లెర్నింగ్ (డీఎల్)లో అధ్యాపకులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించారు. ముఖ్యంగా, గణన భావనలను సమకాలీన ఇంజనీరింగ్, పరిశోధన సమస్యలకు పరిష్కారాలుగా మార్చడంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక భావనలను ఆచరణాత్మక అమలుతో కలిపి, డేటా–ఆధారిత పద్ధతులను విభిన్న సాంకేతిక రంగాలలో ఎలా అన్వయించవచ్చో అన్వేషించడానికి గీతం అధ్యాపకులకు వీలు కల్పించారు. మ్యాథ్ వర్క్స్ కు చెందిన సీనియర్ ట్రైనింగ్ ఇంజనీర్ డాక్టర్ శుభోబ్రత భట్టాచార్య ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారు. ప్రత్యేక సాంకేతిక కార్యక్రమాలు, ముఖాముఖి ద్వారా, ఆయన ఇందులో పాల్గొన్న వారికి కీలకమైన




మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనలను, అలాగే మ్యాట్ ల్యాబ్ టూల్స్, ఫ్రేమ్ వర్కులను ఉపయోగించి వాటి అమలును పరిచయం చేశారు. ఈ సెషన్లు సమకాలీన గణన విధానాలు, ఇంజనీరింగ్, పరిశోధన, సమస్య–పరిష్కారంలో వాటి వినియోగంపై విలువైన అంతర్దృష్టులను అందించాయి.వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపక బృందం ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొని, మ్యాట్ ల్యాబ్, ఫ్రేమ్ వర్కులను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనల అభివృద్ధి, అమలు చేయడంలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు. ముఖాముఖితో ఆచరణాత్మకంగా సాగిన ఈ శిక్షణలో



పాల్గొన్నవారికి అంతర్లీన భావనలు, వాటి ఆచరణాత్మక అనువర్తనాలు.. రెండింటిపై అవగాహనను పటిష్టం చేసుకోవడానికి సహాయపడ్డాయి. ఈ కార్యక్రమం యొక్క ముఖాముఖి స్వభావం, పరిశ్రమకు సంబంధించిన టూల్స్, వర్క్ ఫ్లోలను అన్వేషించే అవకాశాన్ని కూడా కల్పించింది. తద్వారా, ఈ సాంకేతికతలను బోధన, పరిశోధన, ఇంజనీరింగ్ అనువర్తనాలకు వర్తింపజేయడంలో ఇందులో పాల్గొన్న వారి విశ్వాసాన్ని పెంచింది.ఈ కార్యశాలను జీఎస్సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. ప్రశాంత రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. డాక్టర్ మాధవి తాతినేని, డాక్టర్ ఎం. మరియదాసు ఈ కార్యక్రమాన్ని సమన్వయపరిచి, విజయవంతంగా నిర్వహించేలా చూశారు.

# కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం!!

**హైదరాబాద్, ఆగస్టు 20:** – స్టే ఎత్తివేతకు నిరాకరించిన తెలంగాణ హైకోర్టు..

– ఉద్యోగులు జీతాలు, పెన్షన్లు రాక అనేక మందిఅవస్థలకు గురవుతున్నారన్న హైకోర్టు.

– డేంజర్ బెల్స్ మోగుతున్నాయని హెచ్చరిక.. – 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాల వల్ల ప్రజాధనం వృథా.. ప్రజల ట్యాక్స్‌లతో వచ్చే డబ్బును ఉచిత పథకాలకు వాడటం న్యాయమేనా?అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: బండి రమేష్

- సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారు
- బాలానగర్‌లో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**బాలానగర్ ఆగస్టు 21**

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యంగా దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని పేర్కొన్నారు. నేడు భారతదేశం ప్రపంచ స్థాయిలో ఐటీ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి ఆయన తీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. భారతదేశం నేడు ఐటీ ఎగుమతుల రంగంలో ఏటా సుమారు రూ.19.2 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే స్థాయికి చేరుకోవడంలో రాజీవ్ గాంధీ ప్రారంభించిన సాంకేతిక ప్రగతి కీలక పునాదిగా నిలిచిందని బండి రమేష్ పేర్కొన్నారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధి, యువత సంక్షేమం, సాంకేతిక ప్రగతి దిశగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పటేల్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాఘవేందర్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు సత్యపాల్ రెడ్డి, బాల నరసింహ, శ్రీనివాస్, బాల్ రాజు, మహేందర్, సదా గౌడ్, రవి గౌడ్, సోను, భరత్, నరేష్ తదితరులతో పాటు పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

# డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు మణికొండకు పరుగులా?

- షాద్‌నగర్‌లోనే ఆన్‌లైన్ అప్రూవల్ కేంద్రం ఏర్పాటు చేయాలి
- ప్రజల సమయం, డబ్బు వృథా చేస్తున్న అధికారుల విధానంపై తీవ్ర అసంతృప్తి




**(స్పెషల్ కరస్పాండెంట్) షాద్‌నగర్,ఆగస్టు,20, మెదక్ టుడే న్యూస్:** గడువు ముగిసిన డ్రైవింగ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకునేందుకు షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న ప్రజలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం అప్లికేషన్ నంబర్ అప్రూవల్ కోసం రంగారెడ్డి జిల్లా కార్యాలయం మణికొండకు స్వయంగా వెళ్లాల్సి వస్తోందని, షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయ సిబ్బంది చెబుతున్నారని వారు పేర్కొంటున్నారు. షాద్‌నగర్‌తో పాటు పరిసర గ్రామాలు, మండలాల నుంచి వచ్చే వాహనదారులు కేవలం ఒక చిన్న ప్రక్రియ కోసం సుదూర ప్రాంతమైన మణికొండకు వెళ్లాల్సి రావడం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. ప్రయాణ ఖర్చులు, సమయంవృథా కావడంతో పాటు అక్కడికి వెళ్లిన తర్వాత కూడా పని వెంటనే పూర్తికాకపోవడంతో పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. ఒక డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఇంత దూరం ఎందుకు వెళ్లాలి?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ సేవలను స్థానికంగానే అందించే అవకాశం ఉన్నప్పటికీ, అనవసరంగా జిల్లా కార్యాలయానికి పంపడం వల్ల వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం శూన్యం

షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయంలోనే గడువు ముగిసిన డ్రైవింగ్ లైసెన్స్‌ల రెన్యువల్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ నంబర్ అప్రూవల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యను అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి ఇంతవరకు వచ్చిందని వారు అంటున్నారు. ప్రభుత్వం డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్న సమయంలో, ఒక చిన్న అప్రూవల్ ప్రక్రియ కోసం ప్రజలను సుదూర ప్రాంతాలకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### ఇకనైనా అధికారులు స్పందించాలి

షాద్‌నగర్ ప్రాంత ప్రజల ఇబ్బందులను, వారి సమయాన్ని, ప్రయాణ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయంలోనే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ నంబర్ అప్రూవల్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మణికొండలోని జిల్లా కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా షాద్‌నగర్‌లోనే ఈ ప్రక్రియ పూర్తయ్యేలా తగిన సాంకేతిక, పరిపాలనా సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రజల సమస్యలను అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని పలువురు. హెచ్చరిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయం. ప్రజలను దూర ప్రాంతాలకు పంపించే కేంద్రంగా మారకూడదు. షాద్‌నగర్ ప్రజల ఇబ్బందులకు వెంటనే ముగింపు పలకాలి,అని వాహనదారులు స్పష్టం చేస్తున్నారు.

# ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుకలు



**భూపాలపల్లి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 20**

భూపాలపల్లిలోని ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నాయకత్వ బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక మంచి నాయకుడికి క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, ఇతరులను గౌరవించే గుణం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి లక్షణాలు ఎంతో అవసరమని తెలిపారు. నాయకత్వం అంటే కేవలం అధికారం కాదని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవడమే నిజమైన నాయకత్వమని విద్యార్థులకు సూచించారు. అనంతరం నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు అధికారికంగా సాష్‌లు (ఝుంప్త్రవం) ధరింపజేసి, వారి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించేలా ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని నూతన విద్యార్థి నాయకులకు అభినందనలు తెలిపారు.

# ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు




**బాలానగర్ ఆగస్టు 21**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్ సమీపంలోని ఎరుకల బస్తీ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్గా కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర చైర్మన్ కమ్మ కార్పొరేషన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేం దుకు ఆయన ముందుచూపుతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్న బండి రమేష్.. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హోసీ తోచర్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, రామాదేవి, ఎరుకల సురేష్, కొండ కిరణ్, పద్మారెడ్డి, పర్వేజ్, అలీ, గణేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టుపై దాడి

- తెలంగాణ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు
- హబ్సిగూడ, కుషాయిగూడ పన్నీర్ వ్యవహారంపై న్యాయం చేయాలని వేడుకోలు
- మహిళపై దాడి, అసభ్య దూషణలు, సెల్‌ఫోన్ లాక్కున్నారంటూ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆవేదన, సమగ్ర విచారణకు డిమాండ్
- మహిళలపై శారీరక, మానసిక వేధింపులను సహించేది లేదని మహిళా కమిషన్ హెచ్చరిక










**హైదరాబాద్ ( )** కల్తీ ఆహార పదార్థాల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో మహిళా జర్నలిస్టు పై దాడి జరిగిందని ఆరోపిస్తూ బాధితురాలు బొడిగె వాణి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో పన్నీర్ ప్యాకింగ్‌కు సంబంధించిన వ్యవహారాన్ని అదేవిధంగా కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద కల్తీ పన్నీర్ అమ్మకాల వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో తనపై దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి తోసివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించినప్పటికీ తనకు అసలు న్యాయం జరగలేదని బాధిత మహిళా జర్నలిస్టు ఆవేదన వ్యక్తం చేశారు.

### కల్తీని వెలుగులోకి తేవడం నేరమా.?

సమాజ శ్రేయస్సు,ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కల్తీ ఆహార పదార్థాలపై ఎంతో కష్టపడి సమాచారం సేకరించి, వాస్తవాలను నిర్ధారించుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జర్నలిస్టుల బాధ్యత అని బాధితురాలు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారే కల్తీ ఆహారాన్ని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అధికారులకు సమాచారం ఇచ్చిన మహిళా జర్నలిస్టుపైనే దాడి జరిగిందని ఆరోపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

### మహిళపై దాడి, మానసిక వేధింపులు

సభ్య సమాజం తలదించుకునేలా ఒకమహిళా జర్నలిస్టుపై శారీరక దాడితో పాటు అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరించడం, ఫోన్ లాక్కోవడం వంటి భయాందోళనలను కలిగించే ఘటనలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలపై శారీరక దాడులు మాత్రమే కాకుండా మానసిక వేధింపులు, అవమానించడం, బెదిరింపులకు పాల్పడటం కూడా తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని మహిళా హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. మహిళలు తమ వృత్తి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న సమయంలో వారిని భయపెట్టడం, దూషించడం, అడ్డుకోవడం లేదా దాడులకు పాల్పడడం ఏ రూపంలోనూ సమర్థనీయం కాదని మహిళా కమిషన్ స్పష్టమైన వైఖరిని కలిగి ఉండాలని వారు కోరుతున్నారు.

### మహిళలపై దాడులు సహించేది లేదు

మహిళలపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై దాడులు జరిగితే ఘటనను తీవ్రంగా పరిగణించి బాధితురాలికి భద్రత, న్యాయం కల్పించాల్సిన బాధ్యత ఉన్నత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమనే స్పష్టమైన సందేశాన్ని తెలంగాణ మహిళా కమిషన్ ఇవ్వాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

### దాడి చేసిన వారెవరు.? కేసులు ఎవరిపై.?

తమపై దాడి ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయని బాధిత జర్నలిస్టులు చెబుతున్నారు. వీడియో ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పోలీసులకు అందించిన ఫిర్యాదులు తదితర ఆధారాలను పరిశీలిస్తే ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది తేలుతుందని వారు పేర్కొన్నారు. తమ ఫిర్యాదును పూర్తిస్థాయిలో విచారించకుండానే ఎవరి ప్రోద్బలంతో జర్నలిస్టులపైనే కేసులు నమోదు చేశారనే ఆరోపణలపై కూడా ప్రత్యేక అధికారులచే సమగ్ర విచారణ జరిపించాలని మహిళా కమిషన్‌ను కోరుతున్నారు.

### పోలీసుల తీరుపై ప్రశ్నలు..

మహిళా జర్నలిస్టు తనపై దాడి జరిగిందని పోలీసులను ఆశ్రయించినప్పుడు ఆమె ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించారా.? ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీలు, వీడియో ఆధారాలను సేకరించారా.? ప్రత్యక్ష సాక్షులను విచారించారా.? దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.
మహిళా బాధితురాలి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, అసభ్య పదజాలాలతో దూషించడం, దాడి చేయడం, మహిళ నుండి బలవంతంగా ఫోన్ లాక్కోవడం నిజమైతే బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలనిసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### అక్రమార్కులకు అండగా మారుతుందా.?

కల్తీ ఆహార పదార్థాలపై సమాచారం ఇచ్చే వ్యక్తులు, వాటిని వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు భయపడే పరిస్థితి ఏర్పడితే అక్రమ వ్యాపారం చేసే వారికి మరింత ధైర్యం చేకూరే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఉన్నతాధికారులు కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్న సమయంలో క్రింది స్థాయి అధికారులు ఫిర్యాదులు, దాడుల విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తే ప్రభుత్వ చర్యలపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### పైస్థాయిలో ఉక్కుపాదం.. కిందిస్థాయిలో సహకారం.?

కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు వారికి సహకారం అందిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నంత అధికారుల ఆదేశాల అమలు ఎలా ఉందన్నది ఓయూ, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే కల్తీ వ్యాపారాలను ఎలా అరికడతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలి

మహిళా జర్నలిస్టుపై జరిగిన దాడి, అసభ్య పదజాలాలతో దూషణలు, సెల్‌ఫోన్ లాక్కోవడం, తోసి వేయడం పోలీసులకు చేసిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న వీడియో, ఆడియో ఆధారాలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని బాధితురాలు కోరారు. ఘటనలో మహిళపై దాడి జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం


మహిళలపై దాడులు, వేధింపులు, బెదిరింపులు, దూషణలు, అవమానకర ప్రవర్తన వంటి ఘటనలను సాధారణ విషయాలుగా తీసుకోకూడదని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయి. మహిళలు తమ వృత్తి, ఉద్యోగం లేదా ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సమయంలో వేధింపులకు గురైతే రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం చాలా ఉందని మహిళలు కోరుతున్నారు.
మహిళా జర్నలిస్టుపై దాడి ఆరోపణలపై ఉన్నత అధికారులచే నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, మహిళలపై దాడులు, అసభ్య పదజాలాలతో దూషణలు, మానసిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఫుడ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు
కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి కానీ మహిళా జర్నలిస్టులపై కాదని అవినీతి, అక్రమాలు, కల్తీ వ్యాపారాలను వెలుగులోకి తీసుకువచ్చే వారిని భయపెట్టడం కాకుండా వారికి రక్షణ కల్పించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. కల్తీ ఆహారంపై పోరాటం ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్నందున అసలు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టం కఠినంగా వ్యవహరించాలని కానీ సమాచారం అందించిన వారిపై కఠినంగా వ్యవహరించడం కేసులు నమోదు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని , ఇప్పటికైనా ఉన్నత అధికారులు బాధిత మహిళా జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో 47 అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం.

**- డా. జి. స్వర్ణ కుమారి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్.**

**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20**

ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. స్వర్ణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రొఫెసర్––5, అసోసియేట్ ప్రొఫెసర్––17, అసిస్టెంట్ ప్రొఫెసర్––25 చొప్పున మొత్తం 47 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను 2027 మార్చి 31 వరకు లేదా అవసరం మేరకు ఒప్పంద ప్రాతిపదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు సెప్టెంబర్ 10వ తేదీన వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోస్టుల వారీగా అర్హతలు, ఇతర నిబంధనలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం. https://gmcmulugu.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్‌డా.జి. స్వర్ణ కుమారి సూచించారు.


పత్రికా ప్రచురణార్థం
తెలంగాణ ప్రభుత్వం
ప్రిన్సిపాల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, ములుగు , ములుగు జిల్లా, తెలంగాణ .
Rc.No. E1/133/GMC/MLG/2026/01-2026 తేది: 20-8-2026
కాంట్రాక్ట్ రిక్రూట్మెంట్ కొరకు నోటిఫికేషన్ విడుదల

ప్రొఫెసర్-5, అసోసియేట్ ప్రొఫెసర్-17 , అసిస్టెంట్ ప్రొఫెసర్-25 పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన 31.03.2027 వరకు లేదా అవసరం తీరినంత వరకు, ఏది ముందు అయితే అది వరకు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికన నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

ములుగు లోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ & దాని అనుబంధ ఆసుపత్రిలో వివిధ డిపార్ట్మెంట్ నందు పనిచేయడానికి G.O.R.T.No: 1276, ఫైనాన్స్ HRM (VII) తేది: 16.07.2026 ప్రకారం. తేది 24.08.2026 ఉదయం 11 గంటల నుండి 01.09.2026 మధ్యాహ్నం 2.00 గంటల వరకు వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి మరియు వాక్ ఇన్ ఇంటర్వ్యూ తే : 10.09.2026 న నిర్వహించబడును.

మరిన్ని సమాచారం మరియు దరఖాస్తు కొరకు, అధికారిక వెబ్‌సైట్ https://gmcmulugu.org ను సందర్శించండి.

Dr G.Swarna Kumari
Principal
Government Medical College
Mulugu

# ఆగస్టు 24 నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి.

**ప్రజలు తమ అర్జీలను నూతన ఐడీఓసీ కార్యాలయంలో అందజేయాలి.**
**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20**

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 24వ తేదీ నుంచి నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ), ములుగులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎడమ వైపున ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ములుగు గట్టమ్మ సమీపంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన అత్యాధునిక సౌకర్యాలతో నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లా స్థాయి శాఖల కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడంతో ప్రజలు తమ పనుల కోసం వేర్వేరు ప్రాంతాల్లోని కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా ప్రభుత్వ సేవలు పొందే అవకాశం కలిగిందన్నారు.విశాలమైన కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, ప్రజలకు అనుకూలమైన వసతులతో నూతన కలెక్టరేట్‌ను జిల్లా పరిపాలనకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను సమర్పించేందుకు ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే సమయంలో ఈ మార్పును గమనించాలని సూచించారు. ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు తమ దరఖాస్తులను అందజేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.


# కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

**- సీతారాం, ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయం ములుగు**

**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026–27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్రీయ విద్యాలయం ములుగు ప్రిన్సిపల్ సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.బాలవాటిక––1 నర్సరీ స్థాయి, బాలవాటిక––2 ఎల్‌కేజీ స్థాయి, బాలవాటిక––3 యూకేజీ స్థాయి,1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నూతన ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.ప్రవేశాల కోసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, సెప్టెంబర్ 10న లాటరీ, సెప్టెంబర్ 12న ప్రవేశ జాబితా ప్రచురణ, సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు ప్రవేశాలు, ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, సెప్టెంబర్ 23 నుంచి తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రవేశ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ప్రవేశాలు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థుల వయస్సు, రిజర్వేషన్ తదితర ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశానికి దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీతారాం కోరారు.


केन्द्रीय विद्यालय, मुलुगु
तेलंगाना मॉडल स्कूल कैंपस, जवाहर नगर गांव, वेंकटपुर मंडल
जिला: मुलुगु, तेलंगाना (पिन 506344)
(शिक्षा मंत्रालय, भारत सरकार केअधीन एक स्वायत्त निकाय)
KENDRIYA VIDYALAYA, MULUGU
TELANAGANA MODEL SCHOOL CAMPUS, JAWAHAR NAGAR VILLAGE,
VENKATAPUR MANDAL, Dist: MULUGU, TELANGANA – 506344
(An Autonomous Body under the Ministry of Education, Govt of India)
email: kendriyavidyalayamulugu@gmail.com KVS Region Code: 11 KV Code:2559
फ. सं. 1-4 /के. वि. मुलुगु /2026-27/ दिनांक:20.08.2026

ప్రెస్ నోట్
కేంద్రియ విద్యాలయ ములుగు 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

కేంద్రియ విద్యాలయ ములుగు, జిల్లా ములుగు, తెలంగాణలో 2026–27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవాటిక-3 మరియు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు కొత్త ప్రవేశాల ప్రక్రియ నిర్వహించబడుతోంది.
కొత్తగా ప్రారంభమైన ఈ కేంద్రియ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి మరియు అర్హత కలిగిన తల్లిదండ్రులు నిర్ణీత తేదీలలో నమోదు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రవేశాల ముఖ్యమైన తేదీలు

| ప్రవేశ కార్యక్రమం | తేదీ |
|---|---|
| ప్రవేశాల కోసం నమోదు | 21.08.2026 నుండి 05.09.2026 వరకు |
| లాటరీ / డ్రా | 10.09.2026 |
| ప్రవేశ జాబితాల ప్రదర్శన | 12.09.2026 |
| ప్రవేశ కేటాయింపు మరియు ప్రవేశ ప్రక్రియ | 15.09.2026 నుండి 21.09.2026 వరకు |
| తరగతుల ప్రారంభం | 23.09.2026 |

ప్రవేశ ప్రక్రియ కేంద్రియ విద్యాలయ సంగటన్ (KVS) ప్రవేశ మార్గదర్శకాలు మరియు నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుంది. అర్హత, వయస్సు, ప్రాధాన్యతా క్రమం, రిజర్వేషన్ మరియు ఇతర ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయి.

అర్హులైన తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశానికి నమోదు చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. ప్రవేశానికి సంబంధించిన తదుపరి సమాచారం మరియు జాబితాలు పాఠశాల ద్వారా అధికారికంగా తెలియజేయబడతాయి.

పాఠశాల చిరునామా
కేంద్రియ విద్యాలయ ములుగు
తెలంగాణ మోడల్ స్కూల్ క్యాంపస్,
జవహర్ నగర్ గ్రామం, వెంకటాపూర్ మండలం,
జిల్లా: ములుగు, తెలంగాణ – 506344

ప్రిన్సిపాల్
కేంద్రియ విద్యాలయ ములుగు
प्राचार्य /PRINCIPAL
केन्द्रीय विद्यालय KENDRIYA VIDYALAYA
मुलुगु /MULUGU
तेलंगाना / TELANGANA-506344

# పోచారం అడవిలో పర్యాటకులకు కొత్త ప్రయాణ వాహనం

- అడవి అందాలను ఆస్వాదించేలా ఆధునిక వాహనం ప్రారంభం
- పోచారాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

~~మెదక్, ఆగస్టు 20, మెదక్ టుడే న్యూస్: (ప్రతినిధి)~~



పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకుల సౌకర్యార్థం కొత్త ఆధునిక ప్రయాణ వాహనాన్ని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. అటవీ అందాలను పర్యాటకులు సౌకర్యవంతంగా వీక్షించేలా ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యంతో ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పిస్తూ పోచారం అడవిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను మరింత విస్తరించాలని అధికారులకు సూచించారు.పర్యాటకులు అటవీ నియమాలను పాటిస్తూ ప్రకృతి సంపదను కాపాడాలని ఎమ్మెల్యే కోరారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పోచారం అటవీ ప్రాంతాన్ని ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు

- రూ.20 వేల జరిమానా.. శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులకు ఎస్పీ అభినందన

**మెదక్,ఆగస్టు,20,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి):**




బాలికను వేధిస్తూ అసభ్యకరమైన చిత్రాలు పంపాలని కోరడంతోపాటు బెదిరింపులకు పాల్పడిన కేసులో నిందితుడు దాసరి స్వామి (26)కి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది.పోలీసుల వివరాల ప్రకారం.. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక ఫోన్ నంబర్‌ను స్నేహితుల ద్వారా తీసుకున్న స్వామి తరచూ ఫోన్ చేస్తూ వేధించేవాడు.పాఠశాల వద్దకు వచ్చి తనను కలవాలని ఒత్తిడి చేయడంతోపాటు, కలవకపోతే పెట్రోల్ పోసుకుని చచ్చిపోతానంటూ బెదిరించాడు. అనంతరం బాలిక తల్లిదండ్రులకు ఇకపై ఆమె జోలికి రానని రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు.అయితే రెండేళ్ల తర్వాత మళ్లీ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికను వేధిస్తూ అసభ్యకరమైన చిత్రాలు పంపాలని కోరాడు. 2024 మే 24న బాలిక తండ్రికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు.దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శివంపేట పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించారు.పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం.సుభావాలి నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు.కేసు దర్యాప్తు, కోర్టు వ్యవహారాల్లో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కృష్ణగౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారు.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించారు.

# ఫొటో జర్నలిస్టులకు సాయిబాబా మందిరంలో సన్మానం

**లిహనుమకొండ ఆగస్టు 20**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఏషియన్ మాల్ పక్కన ఉన్న సాయిబాబా మందిరంలో ఫొటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. సాయినాథుని ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులకు శాలువాలు కప్పి, సన్మానించి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మతుకుమల్ల హరిగోపాల్, ప్రధాన కార్యదర్శి వేయిగండ్ల రమేష్, ఆలయ ధర్మకర్త మండలి సభ్యుడు, పీఆర్ఓ నిమ్మల శ్రీనివాస్ తదితరులు ఫొటో జర్నలిస్టులను సన్మానించారు.సమాజంలో జరిగే ప్రతి సంఘటనను కెమెరా కంటితో ప్రజల ముందుకు తీసుకువచ్చే ఫొటో జర్నలిస్టుల సేవలను ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. తమ చిరు సన్మానాన్ని స్వీకరించిన ఫొటో జర్నలిస్టులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు."బాబా ఆశీస్సులు మీ కెమెరా కంటికి, మీ అడుగులకు ఎల్లవేళలా తోడుగా ఉండాలని కోరుకుంటున్నాం" అని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఫొటో జర్నలిస్టులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



# జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యురాలిగా శనిగరపు అనిత

**హన్మకొండ, ఆగస్టు 20**

హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యురాలిగా 56వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శనిగరపు అనిత నియమితులయ్యారు. గురువారం హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.పార్టీ బలోపేతానికి అనిత అందిస్తున్న సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఆమెకు జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.56వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగుతూనే జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అనిత పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, జిల్లా కాంగ్రెస్ నాయకులు కాదారి రణధీర్, పోలేపల్లి బుచ్చిరెడ్డి, సమ్మెట మహేష్ గౌడ్, రాయపురం సాంబయ్య,



ఇల్లందుల ఎలిశా తదితరులు పాల్గొని అనితకు శుభాకాంక్షలు తెలిపారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..